# టూ-ఇన్-వన్

ఎన్. శివనాగేశ్వరరావు

పెళ్ళిళ్ళ పేరయ్య సంచి లోంచి ఆల్బమ్ తీసి పేజీలు తిరగేస్తూ ఒక్కో అమ్మాయి ఫొటో చూపిస్తూ, వారి అందచందాలు, గుణగణాలు, ఇచ్చుకోగలిగిన కట్నకానుకలు వివరిస్తున్నాడు.

నారాయణరావు అతని మాటలు అంతగా పట్టించుకోకుండా "లాభం లేదయ్యా! నీవు ఎన్ని సంబంధాలు తెచ్చినా మా వాడికి నచ్చడం లేదు. ఇవి మాత్రం నచ్చుతాయని గ్యారంటీ ఏమిటి? ఇక నేను వాడి పెళ్ళి విషయంలో కలగజేసుకోదలచుకోలేదు. అయినప్పుడు అవుతుంది పెళ్ళి" అని ఖరాఖండిగా చెప్పేశాడు.

'అలాగంటే ఎలా సార్! ప్రయత్నమంటూ చేయాలి కదా! ఈ ఫొటో చూడండి అమ్మాయి అపరంజి బొమ్మ. పెళ్ళాడతామని ఎందరో అబ్బాయిలు ఎగబడుతున్నారు. అయితే అమ్మాయికి ఎవరూ నచ్చడం లేదు. ఈ అమ్మాయిని అబ్బాయికి చూపిద్దాం. అదృష్టవశాత్తూ ఇద్దరికీ ముడిపడుతుందేమో!' అన్నాడు పెళ్ళిళ్ళ పేరయ్య.

నారాయణరావు ఫొటోలోని అమ్మాయి వంక చూశాడు. ఆ అమ్మాయి అందం అంతంత మాత్రంగా ఉంది. ఆ అమ్మాయిని అపరంజి బొమ్మ అని చెప్పిన పెళ్ళిళ్ళ పేరయ్య ముఖంలోకి విసుగ్గా చూసి "ఎలాగోలా ముడి పెట్టేయడానికి ఏమైనా చెప్తావు. అవసరమైతే కబురు చేస్తాను" ఇక వెళ్ళవచ్చు అన్నట్టు ముఖం పెట్టాడు నారాయణరావు.

అతని భార్య జానకమ్మ అందించిన ఫలహారం పళ్ళెం ఖాళీ చేసి, కాఫీ తాగా 'అయ్యా... మరి...' అని నసిగాడు పెళ్ళిళ్ళ పేరయ్య. అతని భావం గ్రహించిన నారాయణరావు జేబులోంచి యాభై కాగితం తీసి అందించాడు. పెళ్ళిళ్ళ పేరయ్య ముఖం చేటంత చేసుకుని ఒంగి దండం పెట్టి నిష్క్రమించాడు.

అతను వెళ్ళాక "పాపం! అతని మీద విసురుకుంటారెందుకు? తప్పు మనవాడిలో పెట్టుకుని!" అంది జానకమ్మ. "అందుకే మనం మౌనంగా ఉందాం. వాడి తిప్పలేవో వాడే పడతాడు. వాడికి నచ్చినమ్మాయి దొరికినప్పుడు నాలుగు అక్షింతలు వేద్దాం" అన్నాడు నారాయణరావు.

"ఇప్పటికి ముప్పై ఏళ్ళు వచ్చాయి. ఇలాగే తాత్సారం చేస్తే వెంట్రుకలు తెల్లబడతాయి" అంది జానకమ్మ. "తెల్లబడనీ! ఇప్పుడు నాకు వేస్తున్నావు జుట్టు రంగు. అప్పుడు వాడికీ వేద్దువు" అన్నాడు నారాయణరావు మీసం దువ్వుకుంటూ. "బానే ఉంది సరసం. ముందు వాడికి మంచి సంబంధం చూడమని ఇంక వేరే వారికెవరికైనా చెప్పి చూడండి" అంది జానకమ్మ. 'చూద్దాం' అన్నాడు నారాయణరావు.

అంతలో హుషారుగా ఈల వేసుకుంటూ లోనికొచ్చాడు అరవింద స్వామి. "ఏరా స్వామి! పెళ్ళెప్పుడు చేసుకుంటావురా!" అంది జానకమ్మ.

"ఏమిటే ఉరుములేని పిడుగు?" అన్నాడు అరవింద్ షూ లేస్ విప్పుకుంటూ. "ఇప్పుడే పెళ్ళిళ్ళ పేరయ్య వచ్చి వెళ్ళాడు. మంచి సంబంధం ఉందట" అంది జానకమ్మ. "వీడొకడు! నా ప్రాణానికి శనిలా దాపురించాడు. రావద్దని చెప్పినా జలగలా వదలడు వెధవ" విసుక్కున్నాడు అరవింద్.

"అది కాదురా స్వామీ!..." అని ఏదో చెప్ప బోయింది జానకమ్మ. "నీవొకదానివి. ఎన్నిసార్లు చెప్పాను. అలా స్వామీ!... అని పిలవొద్దని. తాతపేరు కలిపి నా ప్రాణం తీస్తున్నారు" మళ్ళీ విసుక్కున్నాడు అరవింద్.

"సర్లె! నీ మాట ప్రకారమే అలా పిలవను. తొందరగా పెళ్ళి చేసుకోరా? ముప్పై ఏళ్ళు నిండబోతున్నాయి" కళ్ళు నీళ్ళు పెట్టుకుంది జానకమ్మ. "ఆ బోరింగ్ కట్టేయి. నా కలల రాణి కనిపించాలిగా. అప్పుడే నా పెళ్ళి..." తన గదిలోకి పోయి తలుపు వేసుకున్నాడు అరవింద్.

"నా మాట వింటావా! వాడి తిప్పలు వాడు పడతాడు. ఇక వాడి పెళ్ళి ఊసెత్తకు!" అని వార్నింగిచ్చాడు నారాయణరావు.

* * *

అరవింద్ ఫ్రెష్‌గా స్నానం చేసి టూ-ఇన్-వన్‌లో టేప్ ఆన్ చేశాడు. వెస్ట్రన్ మ్యూజిక్ వస్తున్నది. హుషారుగా ఒంటిమీద లుంగీతోనే అయిదు నిమిషాలు మ్యూజిక్‌కి అనుగుణంగా డ్యాన్స్ చేశాడు. తరువాత విసుగనిపించి టేప్ ఆఫ్ చేసి రేడియో ఆన్ చేశాడు. రవిశంకర్ సితార్ వాయిద్యం వినవచ్చింది.

అరవింద్ కుర్చీలో చేరగిలబడి కూర్చొని, కళ్ళు మూసుకుని సితార్ స్వరాలు వినసాగాడు. అతని మనసు దివ్యలోకాలలో తేలియాడింది.

ఎవరైనా అతన్ని గమనిస్తే ఇంతకుముందు వెస్ట్రన్ మ్యూజిక్‌ని అంతగా ఎంజాయ్ చేసిన కుర్రాడేనా... ఇప్పుడీ సితార్ స్వర మధురిమను ఇంతగా ఆస్వాదిస్తున్నది? అని ఆశ్చర్యపోతారు.

అదే అరవింద్‌లోని ప్రత్యేకత. అందరూ ఏదో ఒక కళను ఇష్టపడతారు. అతను భిన్నమైన రెండింటినీ ఇష్టపడతాడు.

అదే అతని జీవితంలో తుఫాన్ సృష్టించింది.

చిన్నప్పటి నుంచీ అరవింద్ ప్రకృతి ఆరాధకుడు. అందమైన పెయింటింగ్స్ అంటే ప్రాణం. మ్యూజిక్ అంటే చెప్పలేనంత ఇష్టం. కవిత్వం ఆరో ప్రాణం. ఇక స్పోర్ట్స్‌లో అయితే ఛాంపియన్, షటిల్, క్రికెట్, బ్యాడ్మింటన్... ఎందులో అయినా అరవింద్ నంబర్ వన్. ఇక చదువులో యూనివర్శిటీ ఫస్ట్. ఇన్ని టాలెంట్స్ ఉన్న అతన్ని ఏ ఆడపిల్ల ఇష్టపడకుండా ఉండగలదు?

కొందరమ్మాయిలు లవ్ లెటర్స్ వ్రాస్తే, కొందరమ్మాయిలు డైరెక్ట్‌గానే 'ఐ లవ్యూ' అని చెప్పాశారు.

అరవింద్ అందరితో క్లోజ్‌గా మూవ్ అయ్యేవాడు. అయితే అతని చనువు స్నేహం వరకే పరిమితం. అతనెప్పుడు ఏ ఆడపిల్లనూ సెక్సువల్ థాట్‌తో చూడలేదు.

అయితే ప్రతి అమ్మాయితో స్నేహం చేసేటప్పుడు 'ఈ అమ్మాయి నా భార్య అయితే ఎలా వుంటుంది?' అని మాత్రం ఆలోచించేవాడు. మంచి చెడ్డలు బేరీజు వేసేవాడు.

అరవింద్‌కు నవ్వుతు, తుళ్ళుతూ, సరదాగా, చలాకీగా ఉండే అమ్మాయిలను చూస్తే ఉరికే జలపాతాలు జ్ఞప్తికి వచ్చేవి. అలా హుషారుగా ఉండే అమ్మాయిలంటే అతనికెంతో ఇష్టం. వాళ్ళతో తనూ స్పోర్టివ్‌గా మూవ్ అవుతూ, జోక్స్ వేసి నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడు. అలాంటప్పుడు ఇలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే బాగుంటుంది అనిపించేది. మరుక్షణం ఎప్పుడూ, ఈ వాగుడు, దూకుడు భరించడం బోరేమో అనిపించేది.

అలానే నెమ్మదిగా, ఒద్దికగా ఉండే అమ్మాయిలను చూసినప్పుడు నిండుగా పారే నదులు జ్ఞాపకానికి వచ్చేవి. అలాంటి వారితో మాట్లాడుతుంటే మనసుకు సంతోషంగా అనిపించేది. అప్పుడు ఇలాంటి అమ్మాయిని చేసుకుంటే? అనిపించేది. మరుక్షణం, మన్నుతిన్న పాముల్లా ఉంటూ మనల్ని కూడా నిర్జీవంగా తయారు చేస్తారేమో! అనిపించేది.

అరవింద్ తన మనసులోని భావాలను ఎవరితో పంచుకునే వాడు కాదు. పైకి నవ్వుతూ కనిపించే అరవింద్ తన మనసులోని చాలా మథనపడేవాడు. అందుకే ఎందరు అమ్మాయిలను చూసినా అతని మనసు ఎవరివైపు మొగ్గలేదు.



రేడియోలో రవిశంకర్ సితార్ వాయిద్యం ముగిసింది. అరవింద్ రేడియో ఆఫ్ చేసి టీపాయ్ మీదనున్న వీక్లీ అందుకుని తిరగేశాడు. అందులో విమల్ శారీస్ అడ్వర్టయిజ్‌మెంట్ కనిపించింది. అందులో ఇద్దరు అందగత్తెలు ఉన్నారు. వారి వంక పరిశీలనగా చూశాడు అరవింద్.

ఒకమ్మాయి చలాకీగా, నవ్వుతూ ఎగిరిపడుతున్న తరంగంలా ఉంది. ఎంత బావుందో అనుకున్నాడు అరవింద్. మరుక్షణం అతని దృష్టి మరో అమ్మాయి మీద పడింది. ఆ అమ్మాయి చిరునవ్వుతో, కొద్దిగా సిగ్గు, బెదురుతో ముడుచుకున్న పువ్వులా ఉంది. 'ఈ అమ్మాయి బావుంది' అనుకున్నాడు. మరుక్షణం 'ఛీ! ఈ టేస్టే నా కొంప ముంచింది' అని తల బాదుకున్నాడు అరవింద్.

పెళ్ళి చేసుకోమన్న తల్లిదండ్రుల పోరు జ్ఞాపకానికి వచ్చింది. 'ఎలా పెళ్ళాడతాడు? పెళ్ళంటే జీవితాంతం కలిసి ఉండవలసిన భాగస్వామిని ఎంపిక చేసుకోవలసిన వ్యవహారం. తానేమో ఎటూ మొగ్గు చూపలేకపోతున్నాడు. తనకీ జన్మలో పెళ్ళి కాదేమో!' అరవింద్‌కి తలనొప్పిగా అనిపించింది.

డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి టి.వి ఆన్ చేశాడు. పాప్ మ్యూజిక్ వస్తున్నది. అమిత వేగంతో మెరుపులా డ్యాన్స్ చేస్తున్న ఒక యువతిని చూసి అతని కళ్ళల్లో మెరుపు మెరిసింది. 'వహ్వా!' అనుకున్నాడు.

ఆ ప్రోగామ్ అవగానే ఛానల్ మార్చాడు. కూచిపూడి నృత్యం ప్రోగ్రామ్ వస్తున్నది. ఆ డాన్సర్ని చూసి దేవకన్యలా ఉందనుకున్నాడు అరవింద్. ఆమె నృత్య భంగిమలకు ముగ్ధుడయ్యాడు. 'వెరీ నైస్!' అనుకున్నాడు. మరుక్షణం అతని మనసులో ఇంతకుముందు మెచ్చుకున్న డాన్సర్ గుర్తుకొచ్చింది. 'హస్తిమశకాంతరం ఉన్న డాన్సర్స్ ఇద్దరూ నచ్చారు. 'ఏం టేస్ట్‌రా బాబూ! నాకీ జన్మకు పెళ్ళి కాదు' అనుకుంటూ డ్రెస్ చేసుకుని బయటకు వెళ్ళాడు.

కాసేపు అటు, ఇటు తిరిగి సినిమా హాలు కనిపిస్తే అందులోకి దూరాడు. సినిమా మొదలయింది. ఒక హీరో, ఇద్దరు హీరోయిన్ల సినిమా అది. 'అందులో ఒక హీరోయిన్ ముద్దమందారంలా ఉంది. చిన్నగా మాట్లాడుతుంది. దించిన తల ఎత్తదు. హీరో అంటే అంతులేని ప్రేమ. అయినా పైకి చెప్పదు. ఇంకో హీరోయిన్ ఉంది. పచ్చిమిరపకాయ లాంటి పిల్ల. హీరోతో పచ్చిగా 'నిన్ను ప్రేమిస్తున్నా! నీవు ఒప్పుకోకపోతే, పెళ్లి సంగతి తరువాత. ముందు శోభనం కానిచ్చేస్తా! తరువాత చచ్చినట్టు నీవే ఒప్పుకుంటావు' అంటుంది.

అరవింద్‌కు ఆ ఇద్దరు హీరోయిన్లూ నచ్చారు. తల బాదుకుంటూ థియేటర్ బయటకు వచ్చాడు. 'భగవంతుడా! ఏం టేస్ట్ ఇచ్చావు? ఈ రెండు టేస్ట్‌లూ కావాలంటే ఇద్దర్ని పెళ్ళాడాలి. అది చట్టవిరుద్ధం. నాకీ జన్మకు పెళ్ళి కాదు' అని నిట్టూరుస్తూ ఇల్లు చేరాడు.

* * *

బంధువులమ్మాయి పెళ్ళికి నారాయణరావు,

జానకమ్మలు కావాలనే తాము వెళ్ళకుండా బలవంతం చేసి అరవింద్‌ను పంపించారు. అదేమంటే 'నాకు జ్వరం' అని తప్పకుంది జానకమ్మ. 'మీ అమ్మను చూసుకోవడానికి నేనుండక తప్పదు' అని నారాయణరావు తప్పకున్నాడు.

'నేనూ వెళ్ళను' అన్నా అరవింద్‌ను లిస్ట్ పంపించారు నారాయణరావు, జానకమ్మలు. పెళ్ళి పందిట్లో ఏ పిల్లయినా అరవింద్‌కు నచ్చుతుందేమోనని వారి ఆశ.

అరవింద్ వెళ్ళిన ఊరు చిన్న పల్లెటూరు. ప్యాంట్, షర్ట్, షూస్, కూలింగ్ గ్లాసెస్, చేతిలో బ్రీఫ్ కేస్‌తో బస్ దిగిన అరవింద్ వంక బస్టాండ్‌లోని జనమంతా 'ఎవరితను?' అన్నట్టు చూశారు. పల్లెటూరుకి ఏ కొత్త వ్యక్తి వచ్చినా అందరూ ఆరా గానే చూస్తారు.

అరవింద్, ఒక ఆసామితో 'జానకిరామయ్యగారిల్లు ఎక్కడ?' అని ప్రశ్నించాడు. 'ఒహో పెళ్ళికి వచ్చావా బాబూ! రా! నేను చూపిస్తా!' అని అతను అరవింద్‌ను పెళ్ళి వారింటికి తీసుకుపోయాడు.

పెళ్ళికూతురు తండ్రి, అరవింద్‌కి వరసకు బాబాయి అవుతాడు. అతను అరవింద్‌ను చూడగానే ఎదురెళ్ళి ఆప్యాయంగా పలకరించి ఉండడానికి గది చూపించాడు.

అరవింద్ స్నానం చేసి డ్రస్ చేసుకుని బయటకు వచ్చాడు. అతని దృష్టి ఒక అందమైన అమ్మాయి మీద పడింది. ఆ అమ్మాయి అంత పొడవు కాదు. పొట్టీ కాదు. పంజాబీ డ్రస్ వేసుకుంది. కళ్ళకు నల్ల కళ్ళజోడు పెట్టుకుంది. కోటేరులాంటి ముక్కుకు పెట్టుకున్న వజ్రపు ముక్కుపుడక ఎండపడి తళుక్కున మెరుస్తున్నది. విశాలమైన నుదుటిమీద పడిన ముంగురులు గాలికి కదులుతూ ఆమెకు కొత్త అందాన్నిస్తున్నాయి. పెదవులు తాంబూలం వేసుకున్నంత ఎర్రగా ఉన్నాయి. పల్చటి చెక్కిళ్ళు తాకితే కందిపోయేలా ఉన్నాయి. క్రింద పెదవికి, గడ్డానికి మధ్య చిన్న సొట్ట ఉంది. నవ్వితే అది మరింత అందాన్ని ఇస్తుంది. చక్కటి ఒంపు సొంపులతో ఆమె ఆకృతి మనోహరంగా ఉంది. ఆమె జడ త్రాచుపాములా చాలా పొడవుగా ఉంది. ఈ అమ్మాయి ఈ డ్రస్‌లో కంటే చీరకట్టులో బ్యూటిఫుల్‌గా ఉంటుంది అనుకున్నాడు అరవింద్.

ఆమె నడుస్తూ, నడుస్తూ గోడకు కొట్టుకుని పడబోయి తమాయించుకుంది. ఆ అమ్మాయి చేత్తో తడుముకుంటూ నడుస్తుంటే అప్పుడు తెలిసింది అరవింద్‌కు ఆ అమ్మాయి నల్ల కళ్ళజోడు ఎందుకు పెట్టుకుందో! అంత అందమైన అమ్మాయి గ్రుడ్డిదని తెలియగానే అతని హృదయం ఆర్ద్రమయింది.

అరవింద్ ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళి 'మే ఐ హెల్ప్ యూ!' అని అడిగాడు. 'ఎస్ ప్లీజ్! నన్ను ఏదైనా కూర్చీలో కూర్చోబెట్టరూ! ప్లీజ్!' అందా అమ్మాయి అర్థింపుగా.

అరవింద్ ఒక చెట్టు క్రింద కుర్చీ వేసి ఆ అమ్మాయిని కూర్చోబెట్టి 'మీ వాళ్ళనెవరినైనా పిలవమంటారా?' అని అడిగాడు. 'నో థేంక్స్... నన్ను వెదుక్కుంటూ మా ఫ్రెండ్ తప్పక వస్తుంది. బై ది బై... ఐ యామ్ శ్రావ్య. మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్!' అందా అమ్మాయి.

'ఐ యామ్ అరవింద్. పెళ్ళికూతురు తరఫు' అన్నాడు అరవింద్. థేంక్స్ ఫర్యువర్ కైండ్ హెల్ప్! నేను పెళ్ళి కొడుకు కజిన్ని' అంది శ్రావ్య. ఆ అమ్మాయిలానే ఆమె స్వరం కూడా ఎంతో బావుంది. 'ఇంత బ్యూటీకి బ్లైండ్‌నెస్. గాడ్ హేజ్ నో హార్ట్" అనుకున్నాడు అరవింద్.

అంతలో అక్కడికో అమ్మాయి వచ్చి 'ఏమిటి శ్రావ్యా! ఇక్కడ కూర్చున్నావా?' అంది. శ్రావ్య కోపంగా 'ఎక్కడకు పోయావు. ఈ గుడ్డిదాన్ని ఎవరూ పట్టించుకోకపోతే ఎట్లా! ఎవరో మహానుభావుడు సాయం చేశాడు. లేకపోతే దారి తెలీక ఏ పొయ్యినో తన్ని సాంబారులో గంగాళంలో పడి ఉడికిపోయేదాన్ని' అంది ఏడుస్తూ! 'సారీ! ఊరుకో!' అని ఓదార్చింది ఆమె ఫ్రెండ్.

అరవింద్ బరువెక్కిన మనసుతో అక్కడినుంచి కదిలాడు. పెళ్ళి పందిట్లో కూర్చున్నాడు గాని మనసునిండా శ్రావ్య ఆలోచనలే!

అంతలో అతని దృష్టి దూరంగా ఉన్న నలుగురమ్మాయిల మీద పడింది. వాళ్ళు నలుగురూ ఒక పూలచెట్టు దగ్గర ఒకరికొకరు దగ్గరగా నిలబడి ఫొటోకి పోజిస్తున్నారు. అది కాదు అతన్ని ఆకర్షించింది. 'స్మయిల్ ప్లీజ్!' అంటూ వాళ్ళను ఫొటో తీస్తున్న అమ్మాయి మీద పడింది అరవింద్ కన్ను. ఆ అమ్మాయి ఎవరో కాదు. ఇందాక నల్లటి గాగుల్స్ పెట్టుకు కనిపించిన బ్లయిండ్ గాళ్ శ్రావ్య. అరవింద్ మనసు కుతకుత ఉడికింది. 'గుడ్డిపిల్లలా ఎంత డ్రామా ఆడింది వదలకూడదు' అనుకున్నాడు.

అంతలో చెట్టుమీద నుంచి కాకి రెట్ట వేసింది. అది శ్రావ్య డ్రస్ మీద పడింది. 'ఛీ! పాడు కాకి!' అని క్రింద ఉన్న రాయి తీసి దాని మీదకు విసరి 'మీరు పదండి! నేను డ్రస్ మార్చుకు వస్తాను! అని విడిదింటి వైపు నడిచింది శ్రావ్య.

'దొరికింది ఛాన్స్!' అనుకుంటూ అరవింద్ మెడలోని కెమెరాను సరిచేసుకుని విడిదింటివైపు దూసుకుపోయాడు.

పెళ్ళి ముహూర్తం సమీపించడంతో అందరూ పెళ్ళి పందిట్లో ఉన్నారు. అరవింద్ పిల్లిలా విడిదింటిలోకి దూరాడు.


అతను వెళ్ళేసరికి శ్రావ్య లంగా, జాకెట్ వేసుకుని... ఒంటికి చీర చుట్టబెట్టుకుంటున్నది. ఎవరూ లేరన్న ధైర్యంతో నిర్భయంగా చీర కట్టుకుంటున్నది. ఆమె ఎద పొంగులు నేత్రపర్వంగా ఉన్నాయి.

అరవింద్ మరిక ఆలస్యం చేయకుండా కెమెరా క్లిక్ మనిపించాడు. ఆ ఫ్లాష్ వెలుతురు చూసి ఎవరో తనను ఫొటో తీశారని గ్రహించింది శ్రావ్య. స్త్రీ సహజమైన సిగ్గుతో చటుక్కున చీరను ఛాతీకి అడ్డంగా పెట్టుకుంది. అప్పటికే ఆమె బుగ్గలు అరుణిమ దాల్చాయి. అరవింద్ మరోసారి కెమెరా క్లిక్‌మనిపించాడు.

'హూ ఈజ్ దట్ బ్లడీ ఈడియట్...' అంటూ విసురుగా బయటకు వచ్చింది శ్రావ్య. అక్కడున్న అరవింద్‌ను చూసి తడబడి 'మీరా!' అంది. 'అవును నేనే శ్రావ్య గారూ! గుడ్డి వారికి నేను ఫొటో తీయడం ఎలా తెలిసిందో నాకు తెలీడం లేదు' అన్నాడు.

'ఒన్ మినిట్...' అని శ్రావ్య లోనికి వెళ్ళి చీర కట్టుకు వచ్చింది. చీర కట్టులో ఆమె రతీదేవిలా ఉంది. 'సారీ!' అంది శ్రావ్య. 'నో సారీ! మీ తప్పకు శిక్ష ఇదిగో!' అని అరవింద్ చేతిలోని రెండు ఫొటోలు చూపించాడు. అవి అతని ఇంపోర్టెడ్ కెమెరాలోంచి అప్పటికప్పుడు ప్రింటయి వచ్చాయి.

ఒక ఫొటోలో పైట చాటు లేని పరువాలు తమ



విశ్వరూపం చూపిస్తున్నాయి. మరో ఫొటోలో చీర చాటు పెట్టుకుని సిగ్గుతో మొగ్గలవుతున్న శ్రావ్య.

"ప్లీజ్ అవి ఇచ్చేయండి" అని బుంగమూతి పెట్టి ముద్దుగా అడిగింది శ్రావ్య. అరవింద్ ఒక్కసారి ఆ రెండు ఫొటోల వంక చూసి ఒకటి ఆమెకు అందిస్తూ 'ఇది ఉంచుకోండి. మరీ 'ఎ' సర్టిఫికెట్ పిక్చరులా ఉంది' అన్నాడు. 'థేంక్స్' అంది శ్రావ్య.

ఇద్దరూ పందిట్లోకి నడిచారు. పురోహితుడు అందరికీ అక్షింతలు అందించాడు. మాంగల్యధారణ కాగానే అందరూ అక్షింతలు జల్లారు. తన మీద పడిన అక్షింతలు చూసి అవి ఎవరు విసిరి ఉంటారా? అని తల తిప్పిన అరవింద్‌కు నవ్వుతూ కనిపించింది శ్రావ్య.


ఆమె దగ్గరకు వెళ్ళి 'అక్షింతలు పెళ్ళయిన వారే వేయాలంటారు తెలీదా?' అన్నాడు. 'అదేం కాదు. పెళ్ళి కుదిరిన వారు కూడా వేయవచ్చు' అంది శ్రావ్య. 'అయితే మీ పెళ్ళి కుదిరిందన్నమాట ఎవరా పూర్ ఫెలో!' అన్నాడు అరవింద్. 'ఒప్పుకుంటే మీరే!' అంది శ్రావ్య కొంటెగా. ఆమె ఫాస్ట్‌నెస్‌కి విస్తుపోయాడు అరవింద్.

అరవింద్ భోజనానికి కూర్చున్నాడు. శ్రావ్య అందరికీ ఒక్కో స్వీట్ వడ్డిస్తూ వచ్చి అరవింద్‌కు విస్తట్లో ఒక స్వీట్ వేసి 'ఇది మీది' అంది. డైలాగ్ అర్థం కాలేదు. అరవింద్‌కి మరోక్షణంలో వచ్చి 'ఇది నాది' అని మరో స్వీట్ వడ్డించింది. మరి కాసేపటికి వచ్చి ఎవరికీ వినిపించనంతలో స్వరంతో 'ఇది మన బాబుది' అని మరో స్వీట్ వడ్డించింది. శ్రావ్య మరలా మరో స్వీట్‌తో వస్తుంటే 'నాకు ఒక్కడు చాలు' అన్నాడు అరవింద్ కొంటెగా. అది విన్న ప్రక్కనతను అరవింద్ వంక వింతగా చూశాడు. అది చూసిన శ్రావ్య చిన్నగా నవ్వుతూ అరవింద్ కాలు తొక్కిపోయింది.

భోజనాలు అయ్యాక తనకు తాంబూలం అందిస్తున్న శ్రావ్యతో 'నన్ను పెళ్ళాడ్డం నీ ఇష్టమేనా? నేను ఒప్పుకోనవసరం లేదా?' అన్నాడు అరవింద్. 'ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే ఫొటో తీశాక మీతో కలిసి పెళ్ళి పందిరి వరకు ఏడడుగులు నడిచాను. అక్షింతలు విసిరి తలంబ్రాలు పోశాను. కాలు తొక్కి పెళ్ళితంతు అయిందనిపించాను. భోజనం పెట్టాను. తాంబూలమిచ్చాను. ఇంతకన్నా ఏం కావాలి?' అంది శ్రావ్య.

'మరి శోభనం సంగతి?' అన్నాడు అరవింద్. 'పైట వేయకుండా పరువాలు చూశారు. అదే శోభనం' అంది శ్రావ్య. ఆమె మాట్లాడుతుంటే శ్రావ్య ముఖంలోకి చూస్తున్న అరవింద్ ఆమె కన్నులోని కొంటెదనాన్ని, ముఖంలోని చిలిపిదనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

అంతలో అనుకోని సంఘటన జరిగింది. ఆడుకుంటూ ఎవరో ఆకతాయి పిల్లవాడు విసిరిన రాయి సూటిగా వచ్చి అరవింద్ నుదుటికి తగిలింది. 'అబ్బా!' అంటూ అరవింద్ చేత్తో




నుదుటిని అద్దుకున్నాడు. రాయి సూటిగా వుండడంతో నుదుటికి లోతుగా గుచ్చుకుని చివ్వున రక్తం చిమ్మింది.

అదిచూసిన శ్రావ్య భయంతో ఒణికిపోయింది. గబుక్కున చేతిలోని కర్చీఫ్‌ను అతని నుదుటికి అద్ది పట్టింది. ప్రక్కనున్న చెయిర్ లాగా అతన్ని కూర్చోపెట్టి కర్చీఫ్ విడదీసి అతని నుదుటి చుట్టూ కట్టింది. ఎవరినో పిలిచి పెళ్ళికి వచ్చిన ఒక డాక్టరుగారిని పిలవమని పురమాయించింది. తన నుదుటి చుట్టూ ఉన్న శ్రావ్య చేయి కంపించడం అరవింద్ గమనించాడు. తలెత్తి ఆమె వంక చూశాడు. ఆమె కన్నుల నిండుగా నీరు. 'ఇంత మాత్రానికే!' అన్నాడు అరవింద్. 'నా మూలానే ఇలా జరిగింది. నేను మాటల్లోకి దించకపోతే మీరిక్కడ వుండేవారు కాదు. ప్రమాదం జరిగి ఉండేది కాదు' అంది. ఆమె గొంతు బాధతో జీరపోయింది.

డాక్టర్ వచ్చి ఫస్ట్ ఎయిడ్ చేసి నథింగ్ టు వర్రీ అన్నాడు.

* * *

వారం తరువాత అరవింద్ తల్లిదండ్రులతో శ్రావ్య ఇంటికి వెళ్ళి చూపులకు వెళ్ళాడు. శ్రావ్య పట్టు చీర కట్టుకుని, నగలు పెట్టుకుని దివి నుంచి దిగి వచ్చిన దేవతలా ఉంది.

శ్రావ్య తండ్రి, ఆమెకు అరవింద్ తల్లిదండ్రులను పరిచయం చేశాడు. శ్రావ్య వినయంగా ఒంగి వారి పాదాలకు నమస్కరించింది. తలదించుకుని నేల చూపులు చూస్తున్న శ్రావ్యను చూసి అరవింద్ ఆశ్చర్యపోయాడు. అసలీ అమ్మాయి, నేను పెళ్ళిలో చూసిన అమ్మాయి ఒకరేనా అని అనుమానం వచ్చింది. అది గమనించిన శ్రావ్య ఎవరూ చూడకుండా అరవింద్‌ను చూసి సన్నగా కన్నుగీటింది. అది చూసి ఆ అమ్మాయేనని కన్‌ఫర్మ్ చేసుకున్నాడు అరవింద్.

పెద్దవాళ్ళు కట్నకానుకల విషయాలు మాట్లాడుకుంటున్నారు. తలదించుక్కూర్చున్న శ్రావ్యకు మాత్రమే వినిపించేలా అరవింద్ 'ఎంత వినయం?' అన్నాడు కొంటెగా. 'అది పెద్దలకు మాత్రమే పరిమితం. నా గదికి రండి. మీకు ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది' అంది శ్రావ్య మరింత కొంటెగా.

పెళ్ళయిపోయింది. శోభనం గదిలో అరవింద్ శ్రావ్యను దగ్గరకు తీసుకుంటూ "శ్రావ్యా! నాకు ఉరికే జలపాతాల్లాంటి హుషారైన అమ్మాయిలన్నా ఇష్టమే! నిండుగా పారే నది లాంటి నెమ్మదిగా ఉండే అమ్మాయిలన్నా ఇష్టమే! ఎవరిని ఎంపిక చేసుకోవాలో తేలీక ఇంతకాలం పెళ్ళి వాయిదా వేశాను. నాతో ఎంతో చిలిపిగా ప్రవర్తించిన నీవు, నాకు చిన్న దెబ్బతగిలేసరికి తల్లడిల్లిపోవడం నాకు నచ్చింది. అలానే పెద్దలఎడ నీవు చూపిన వినయం కూడా మెచ్చదగిందే! అప్పుడే తెలిసింది నీకు నాకు చిలిపితనంతో తుళ్ళిపడే జలపాతానివి. ఇతరులకు నిండుగా పారే నదీమతల్లివి. ఒక్క మాటలో నీవు నాక్కావలసిన టు-ఇన్-ఒన్‌వి అన్నాడు.

అందుకు శ్రావ్య నవ్వుతూ 'మిస్టర్ అరవింద్! ప్రతి ఆడపిల్లలోనూ మీరు కోరుకునే రెండు రూపాలూ ఉంటాయి. అయితే భర్తలకు భయపడి కొందరు, సమాజం హర్షించదని కొందరూ తమలోని చైతన్యరూపాన్ని చంపేసుకుని రెండో రూపంతో మిగిలిపోతారు' అంది.

'అయితే, నేనలా జరగనివ్వను. బెడ్‌రూమ్‌లో నిన్ను టేప్ చేసుకుని నా కిష్టమైన శృంగార స్వరాలు పలికిస్తాను. బయట నిన్ను ట్యూన్ చేసి మధురగీతాలు వింటాను. 'ఇక నీదట ఈ టూ-ఇన్-ఒన్ నా ప్రాణం' అంటూ ఆమెను కౌగిలిలో బంధించాడు.